క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో సెప్టెంబర్ 1న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. కాశిబుగ్గ నుంచి పోచమ్మమైదాన్ రోడ్డు, చార్‌బౌళి, నిజాంపుర, మండిబజార్, ఎల్‌బీనగర్, జీఆర్‌గుట్ట, లక్ష్మీపూర్, కూరగాయల మార్కెట్, దేశాయిపేట, ఏనుమాముల మార్కెట్, మహారాజుల కాలనీ, బాలాజీ నగర్ కూడలి, ఎంహెచ్‌నగర్, నజ్రత్‌పుర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

లింగయ్యకు రాధాకృష్ణ అవార్డు



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం ఇన్‌చార్జ్ అధిపతి డాక్టర్ ఎం.లింగయ్య.. సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ గుంటూరులోని చలపతి ఇంజనీరింగ్ విద్యాసంస్థలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ అండ్ టీచర్స్ అసోసియేషన్ సంస్థ ఆదివారం అందజేసింది. ఈ సందర్భంగా లింగయ్యకు నిర్వాహకులు ప్రశంసపత్రంతో పాటు జ్ఞాపిక అందజేసి అభినందించారు.

తెలంగాణ వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడిగా సంపత్



కాజీపేట: తెలంగాణ వడ్డెర సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా గండికోట సంపత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు కాజీపేట మండలం రాంపురం గ్రామానికి చెందిన సంపత్‌కు హైదరాబాద్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి అయిలయ్య ఆదివారం నియామక పత్రం అందజేశారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్లుగా పల్లపు మల్లికార్జున్, నాగరాజు, నగర అధ్యక్షుడిగా శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

సీపీఎం పట్టణ కార్యదర్శిగా సారంగపాణి



కాజీపేట: సీపీఎం కాజీపేట పట్టణ శాఖ కార్యదర్శిగా రామంచ సారంగపాణి నియమితులయ్యారు. ఈ మేరకు సారంగపాణికి మండల పార్టీ కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య ఆదివారం ఉత్తర్వులు అందజేశారు.

బాధితులకు అండగా ఉంటాం



రామన్నపేట: ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన రామన్నపేట రఘునాథ్ కాలనీకి చెందిన ఎలకలపెల్లి సురేష్ కుటుంబానికి బీజేపీ అండగా ఉంటుందని పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ హామీ ఇచ్చారు. ఈ మేరకు బాధితులను ఆదివారం పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వం, కార్పొరేషన్ అధికారులు తక్షణమే స్పందించి నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

అన్నదానం



భోజనం వడ్డిస్తున్న సీతారాంరెడ్డి

హన్మకొండ అర్బన్: బాలసముద్రంలోని ఈఫిల్ టవర్ సమీపంలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయగా, అభివృద్ధి కమిటీ చైర్మన్ నామిరెడ్డి సీతారాంరెడ్డి – హంద్రాదేవి ఆధ్వర్యంలో ఆదివారం మహా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

జూ పార్కులోని మౌస్‌డీర్ దత్తత



న్యూశాయంపేట: జంతువుల సంరక్షణ, దత్తత కార్యక్రమంలో భాగంగా లయన్స్ క్లబ్ హనుమకొండ బాధ్యుడు లయన్ గిల్లా పురుషోత్తం తన మనుమరాలు రాణి సుమేధ పుట్టిన రోజు సందర్భంగా మౌస్‌డీర్‌ను దత్తత తీసుకున్నారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని కాకతీయ జూలాజికల్ పార్కులో ఉన్న మౌస్‌డీర్ వార్షిక దాణా ఖర్చుల నిమిత్తం ఆదివారం 12 వేల రూపాయల చెక్కును జూపార్కు ఫారెస్ట్ బీట్ అధికారి శారదకు అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు తేరాల రమేశ్‌బాబు, వివేకానంద, శ్రీధర్‌రెడ్డి, నిర్మల, రమణారెడ్డి, సుభాష్, శ్రీనివాస్, రాజశేఖరం, బి.అశోక్, ప్రభాకర్, కిరణ్మయి, మోహన్‌రెడ్డి, ప్రభాకర్, విశ్వేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్లతో గుబులు

- పూడ్చివేతలో ఇంజనీర్ల నిర్లక్ష్యం
- శాఖల మధ్య సమన్వయ లోపం
- నిమజ్జనంలో రాకపోకలకు ఇబ్బందులు



సీకేఎం కళాశాల రోడ్డులో ఏర్పడిన గుంతలు



ఉర్సు రోడ్డులో గుంతలో దిగబడిన వాహనం (ఫైల్)

వరంగల్ అర్బన్: వినాయక నిమజ్జనం సమీపిస్తోంది. ఆదివారం నుంచి గణేష్ నిమజ్జన కార్యక్రమాలు ఆరంభమయ్యాయి. నిమజ్జన ఘట్టాలు సజావుగా సాగాలంటే అన్ని శాఖల అధికారుల సహకారం అవసరం. ఈ క్రమంలో వివిధ శాఖల మధ్య సమన్వయ లోపంతో ఏర్పాట్లలో తీవ్ర జాప్యం జరుగుతోంది. అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు తయారు చేసిన అధికారులు అమలులో నిర్లక్ష్యంగా చేస్తున్నారు. నిమజ్జన గడువు దగ్గర పడే వరకూ వేచిచూసి హడావుడిగా పూర్తిచేసి, నిధులను వెనుకేసుకోవడం అలవాటుగా మారిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నగరంలో వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తీసుకెళ్లే దారులు అధ్వానంగా తయారయ్యాయి. గుంతలను పూడ్చడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

నగరంలో పలు చోట్ల..

వరంగల్ నగరంలో భారీగా నిమజ్జనం జరిగే చెరువుల్లో చిన్నవడ్డేపల్లి చెరువు ప్రధానమైంది. ఈ చెరువుకు వెళ్లే దారిలో పోచమ్మమైదాన్ జంక్షన్‌కు సమీపంలో ప్రధాన పైపులైన్ల లీకేజీతో రోడ్డుపై పలు చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. అలాగే, అండర్ రైల్వే గేట్ ప్రాంతంలోని కరీమాబాద్ చెట్లవారి గడ్డ వద్ద మూడు నెలల క్రితం పైపులైన్ ధ్వంసం కాగా, స్మార్ట్ సిటీ రోడ్డుపై పెద్ద గుంత తీసి వదిలేశారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఉర్సు ప్రాంతంలోని పలు కాలనీల నుంచి గణనాథులను తరలించే మట్టి రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఉర్సు రంగసముద్రం చెరువులో గుర్రపు డెక్కను తొలగించలేదు. ఖిలా వరంగల్ అగర్తల, హసన్‌పర్తి, సిద్దేశ్వర గుండం ప్రాంతాలకు వెళ్లే రోడ్లు ఛిద్రమయ్యాయి. అభివృద్ధికి నిధులను కేటాయించిన బల్దియా, ఆర్‌అండ్‌బీ అధికారులు.. పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోకపోవడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యత.. మూణ్నాళ్ల ముచ్చట



లేయర్ కొట్టుకుపోయి రాళ్లు తేలుతున్న రోడ్డు

వరంగల్ అర్బన్: నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనుల నాణ్యత ప్రమాణాలు నానాటికి తీసికట్టుగా మారుతున్నాయి. పదికాలల పాటు మన్నికగా ఉండాల్సిన సీసీ రోడ్లు మూణ్నాళ్లకే సిమెంట్ లేయర్ ఎగిరిపోయి కంకర రాళ్లు తేలుతున్నాయి. నిర్మాణ పనులపై ఇంజనీర్ల పర్యవేక్షణ లోపంతో కాంట్రాక్టర్లు ఆడిందే ఆట పాడిందే పాటగా తయారవుతోంది. అందుకు వరంగల్ 29వ డివిజన్‌లోని పాత రామ టాకీస్, ఆర్యవైశ్య సత్రం మధ్యలో వేసిన సీసీ రోడ్డును ఉదాహరణగా చెప్పొచ్చు. గత 8 నెలల క్రితం రూ.12 లక్షలతో రోడ్డును, డ్రెయినేజీ తదితర నిర్మాణాలు రూ.9 లక్షల వ్యయంతో చేపట్టారు. నిర్మించిన అనతి కాలంలోనే నాసిరకం పనులు కొట్టొచ్చినట్లు కనబడుతున్నాయి. ఇదేంటని సదరు కాంట్రాక్టర్‌ను అడిగితే నిబంధనల మేరకు నిర్మించామని సెలవిస్తున్నాడు. కార్పొరేటర్, ఇంజనీర్లు, డీబీ సెక్షన్, అకౌంట్స్ సెక్షన్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్‌కు ఇలా వివిధ పద్ధతుల్లో పర్సంటేజీలు చెల్లిస్తే తమకేం మిగులుతుందని బాహటంగానే చెబుతున్నాడు. అభివృద్ధి పనులను దగ్గర ఉండి పర్యవేక్షించి, నిబంధనల మేరకు నాణ్యత పర్యవేక్షించాల్సిన ఇంజనీర్లు దాటవేత ధోరణి అవలంబిస్తుండంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నాణ్యత ప్రమాణాలపై బల్దియా ఎస్ఈ, ఈఈలను వివరణ కోరగా అప్పుడున్న ఇంజనీర్లు బదిలీ అయ్యారని, తమ వద్ద వివరాలు లేవని దాటవేస్తున్నారు. అభివృద్ధి పనుల్లో పర్సంటేజీల పర్వంతో మన్నికగా ఉండాల్సిన రోడ్లు త్వరితగతిన దెబ్బతింటున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రసూతి ఆస్పత్రికి వెళ్లే దారేది..?

- రోడ్డుకు ఇరువైపులా వ్యాపారాలు
- అంబులెన్స్ రాకపోకలకు అంతరాయం
- ఇబ్బంది పడుతున్న గర్భిణులు, బాలింతలు



ఇరుకు రోడ్డులో చిక్కుకున్న అంబులెన్స్ (ఫైల్)

ఎంజీఎం: వరంగల్ సీకేఎం ప్రసూతి ఆస్పత్రికి వెళ్లే రోడ్డు అస్తవ్యస్తంగా తయారైంది. పూల వ్యాపారులు ఇరువైపులా దుకాణాలు పెట్టుకుని సగం రోడ్డును ఆక్రమించి వ్యాపారం కొనసాగిస్తుండటంతో సీకేఎం ఆస్పత్రికి వచ్చే గర్భిణులు, బాలింతలతో పాటు అటుగా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎమర్జెన్సీ సమయంలో కనీసం 108 అంబులెన్స్ వాహనం వెళ్లలేని దుస్థితి నెలకొందని స్థానికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పండుగ రోజుల్లో మరీ దారుణం

సాధారణ రోజుల్లో రద్దీగా ఉంటే ఈ దారి.. పండుగలు, శుభకార్యాల సమయాల్లో కిక్కిరిసి పోతుంది. వ్యాపారులు ఇష్టారాజ్యంగా రోడ్డును అడ్డదిడ్డంగా విక్రయాలు చేస్తున్నారు. దాంతో ఆస్పత్రి దారిలో తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతుంటాయి. అసలే ఇరుకుగా ఉండే ఈ రోడ్డు వ్యాపారాలతో ఇంకా కుంచించుకుపోవడంతో గర్భిణులు, బాలింతలు, వారి బంధువులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలి

ఆస్పత్రి దారిలో గందరగోళ పరిస్థితులు కొనసాగకుండా ఉండాలంటే పోలీసు యంత్రాంగం చురుకుగా వ్యవహరించాలని, ఆక్రమణలను అరికట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటేనే రోగులు, ప్రజలకు ఉపశమనం లభిస్తుందని అభిప్రాయపడుతున్నారు.

ముగిసిన ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలు



జెండా ఊపి సైక్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న జిమ్నాస్టిక్ కోచ్ నరేందర్

వరంగల్ స్పోర్ట్స్: హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ (జాతీయ క్రీడా దినోత్సవం) జయంతిని పురస్కరించుకుని హనుమకొండ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 23న ప్రారంభించిన వేడుకలు ఆదివారం ముగిశాయి. వేడుకల్లో భాగంగా చివరిరోజు విద్యార్థులకు సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను డీఎస్ఏ జిమ్నాస్టిక్ కోచ్ నరేందర్ జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. నిత్య జీవితంలో ప్రతిఒక్కరూ సైక్లింగ్ చేయడం వలన ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం వద్ద సైక్లింగ్ పోటీలు ప్రారంభం కాగా, అంబేడ్కర్ విగ్రహం, పబ్లిక్‌గార్డెన్, అశోకా జంక్షన్ మీదుగా తిరిగి స్టేడియానికి విద్యార్థులు చేరుకున్నారు. కార్యక్రమంలో డీఎస్ఏ కోచ్‌లు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, కూరపాటి రమేష్, దేవరకొండ ప్రభుదాస్, ఓనపాకల శంకర్, దేవిక, రాయబారపు నవీన్, బొడ్డు విష్ణువర్ధన్, బత్తిని జీవన్‌గౌడ్, డీఎస్ఏ సిబ్బంది పాల్గొన్నారు.

గణేశ్ మండపాలకు జియో ట్యాగింగ్



నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసులు

హసన్‌పర్తి: నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఈసారి గణేశ్ మండపాలకు జియో ట్యాగింగ్ చేశారు. నగరంలోని మండపాల వివరాలు ఆన్‌లైన్ చేశారు. ఆయా ప్రాంతాలకు చెందిన వివిధ రాజకీయ పార్టీలు, కుల, మత సంఘాలు, పీస్ కమిటీతో పోలీసులు సమావేశాలు నిర్వహించారు. అదేవిధంగా మండపాల వద్ద డీజేలను నిషేధించారు. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లో డీజేల నిర్వాహకులను ముందస్తుగా అదుపులోకి తీసుకుని తహసీల్దార్ల ఎదుట హాజరుపరిచారు. డీజేల నిర్వాహకులు ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘిస్తే ఆరు నెలల పాటు జైలు శిక్ష లేదా రూ.రెండు లక్షల జరిమానా విధిస్తారని పోలీసులు హెచ్చరించారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

గణేశ్ విగ్రహాలను నిమజ్జనం చేసే చెరువులను అధికారులు ఇప్పటికే పరిశీలించారు. వివిధ శాఖల అధికారులతో మాట్లాడి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

ప్రతీ మండపం వద్ద బందోబస్తు

కేయూసీ పోలీస్ స్టేషన్ పరిధిలోనే అత్యధిక మండపాలు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ప్రతీ మండపం వద్ద ప్రత్యేక బృందాలు బందోబస్తు నిర్వహిస్తున్నాయి. అలాగే, నలుగురు ఎస్సైలు పర్యవేక్షిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపడుతున్నాం. – **రవికుమార్, ఇన్‌స్పెక్టర్, కేయూ**

ఉద్యోగికి విరమణ సహజం



రమేష్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

హసన్‌పర్తి: ఉద్యోగికి విరమణ సహజమని ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ ఎస్ఈ మధుసూదన్‌రావు అన్నారు. నాగారం లైన్ ఇన్‌స్పెక్టర్‌గా రౌతు రమేష్ విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందగా, ఆదివారం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో మధుసూదన్‌రావు మాట్లాడారు. రమేష్ ఓ వైపు విద్యుత్‌శాఖలో ఉద్యోగం చేస్తూనే మరో వైపు దళిత సంఘాల తరఫున పోరాటాలు చేసిన నాయకుడని కొనియాడారు. విద్యుత్‌శాఖలో 32 ఏళ్లపాటు నిబద్ధతతో సేవలు అందించారని అభినందించారు. నాగారం సబ్‌స్టేషన్ ఏఈ తరుణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.దానయ్య, హసన్‌పర్తి ఏఈ శిరీష్‌కుమార్, లైన్‌మెన్లు సురేష్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, ఎస్ఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నిమజ్జనం ముగిసేదాకా నిరంతరం నిఘా

- కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్ రెడ్డి



మాట్లాడుతున్న ఏసీపీ ప్రశాంత్ రెడ్డి

కాజీపేట: గణపతి ఉత్సవాలు ముగిసేంత వరకు కాజీపేట సబ్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతలపై నిరంతరం పూర్తిస్థాయిలో నిఘా ఉంచుతామని ఏసీపీ పింగిళి ప్రశాంత్ రెడ్డి తెలిపారు. గణపతి నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని కాజీపేట పట్టణంలోని గణపతి ఉత్సవ మండళ్లను సిబ్బందితో కలిసి ఆదివారం పరిశీలించారు. అనంతరం కాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఉత్సవాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా సాయుధ పోలీసు బలగాలతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. నిమజ్జనానికి ఇబ్బందులు కలగకుండా మండపాల నిర్వాహకులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నిమజ్జన సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులకు గణపతి మండలి సభ్యులు సహకరించాలని కోరారు. డీజే సౌండ్ సిస్టమ్ ఏర్పాటుతోపాటు బాణసంచా కాల్చడం వంటి చర్యలకు దూరంగా ఉండాలన్నారు. అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా సంబంధిత పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

రైల్వే సంఘ్ నాయకులకు స్వాగతం

కాజీపేట రూరల్: రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ సికింద్రాబాద్ డివిజన్ నాయకులకు కాజీపేట రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ నాయకులు కాజీపేట జంక్షన్‌లో ఆదివారం స్వాగతం పలికారు. న్యూఢిల్లీలో ఈనెల 2నుంచి 4వ తేదీ వరకు జరగనున్న నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వే మెన్ (ఎన్ఎఫ్ఐఆర్) 31వ జాతీయ సదస్సుకు ప్రత్యేక రైల్లో వెళ్తూ మార్గమధ్యలో సంఘ్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ జి.ప్రభురాజ్‌తో పాటు డివిజన్ నాయకులు వేగి మురళీకృష్ణ, ఎన్వీఎస్.చౌదరి, సత్యకుమార్‌రెడ్డి, మధు, రవిశంకర్, వినోద్, సునీల్‌కుమార్ కాజీపేట జంక్షన్‌లో దిగగా, వారికి కాజీపేట రైల్వే సంఘ్ నాయకులు స్వాగతం పలికారు.

తరగతులను అడ్డుకున్న 'బీఆర్ఎస్వీ'

హన్మకొండ: హనుమకొండ సర్క్యూట్ హౌస్ రోడ్డులోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఆదివారం తరగతులు నిర్వహిస్తుండగా బీఆర్ఎస్వీ నాయకులు అడ్డుకున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా తరగతులు ఎలా నిర్వహిస్తారని నిర్వాహకులను ప్రశ్నించారు. సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులపై భారం మోపొద్దని సూచించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ విద్యార్థి విభాగం హనుమకొండ జిల్లా కోఆర్డినేటర్ గంద్రకోట రాజేష్ మాట్లాడుతూ నగరంలో కార్పొరేట్ కళాశాలల ఒత్తిడి తట్టుకోలేక చాలామంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నాయకులు పబ్బోజు శ్రీకాంతాచారి, స్నేహిత్, శ్రవణ్, వరుణ్, రాజు, మహేష్, అనిల్, ప్రణయ్, ఆదిత్య, సునీల్, చరణ్ పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన కరపత్రాల ఆవిష్కరణ



నేత్రదానంపై అవగాహన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శ్రవణ్‌కుమార్, యోగా గురువులు, తదితరులు

హన్మకొండ చౌరస్తా: సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో యోగా సాధకులకు నేత్రదానంపై ఆదివారం అవగాహన కల్పించారు. ఆ సందర్భంగా గార్డెన్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, రిటైర్డ్ డీఎఫ్ఓ పురుషోత్తం మాట్లాడారు. ఒకరి నేత్రదానం ఇద్దరికి చూపునిస్తుందని వివరించారు. ఈ మేరకు నేత్రాలతో పాటు అవయవ దానం పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు శంకర్‌రావు, యోగా గురువులు గోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, సంపత్‌కుమార్, వి.శ్రీనివాస్, నర్సయ్య, యోగా సాధకులు పాల్గొన్నారు.

సైకిల్ వినియోగం.. ఆరోగ్యానికి మేలు



సైకిల్ ర్యాలీలో శ్రీనివాసరావు, వలంటీర్లు

రామన్నపేట: సైకిల్ వాడకం ద్వారా కాలుష్య నియంత్రణతో పాటు ఆరోగ్యానికి మేలు కలుగుతుందని ఏవీవీ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కోడిమాల శ్రీనివాసరావు తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని 'ఆరోగ్యవంతమైన దేశం కోసం ఆరోగ్యవంతమైన యువత' అనే అంశంతో ఏవీవీ కళాశాల నుంచి పోచమ్మమైదాన్ మీదుగా ఎంజీఎం సర్కిల్ వరకు ఆదివారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రోజూ కనీసం 30 నిమిషాలు లేదా రెండు నుంచి ఐదు కిలోమీటర్ల వరకు సైకిల్ తొక్కితే ఆరోగ్యకరంగా ఉంటారని అనేక అధ్యయనాల్లో వెల్లడైందని, వైద్యులు కూడా సూచించారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ వలంటీర్లు దేవిశ్రీప్రసాద్, ఎన్.క్రాంతి, కె.సాకేత్, సాయి హర్షిత్, అర్జున్ కార్తికేయ, రాజ్‌కుమార్, నీరజ్, తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న చుక్కయ్య

కాజీపేట: దేశంలో నానాటికి పెరిగిపోతున్న కుల, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని పోరాటం చేయడానికి కార్యకర్తలు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎం.చుక్కయ్య సూచించారు. కాజీపేట మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి ఐకమత్యంగా పనిచేయాలని కోరారు. పట్టణ విద్యార్థుల కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు ఎమ్మెల్యేపై ఒత్తిడి పెంచాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గౌని సాంబయ్య గౌడ్ ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య, కారు ఉపేందర్, జంపాల రమేష్, ఇందిర, అనిత, నాగరాజు, శ్రీను పాల్గొన్నారు.

పోచమ్మతల్లి ఆలయానికి విరాళం

మడికొండ: కాజీపేట మండలం మడికొండలోని పాత పోలీసుస్టేషన్ వద్ద ఉన్న పోచమ్మ తల్లి ఆలయానికి గ్రామానికి చెందిన మచ్చ అరుణ – చంద్రమోహన్ దంపతులు రూ.17,116 విలువైన మట్టి ఇటుకలను ఆదివారం విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొలిపాక వెంకటస్వామి, నర్మెట భిక్షపతి, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంగీత, సాహిత్య కార్యక్రమం



రవికుమార్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

హన్మకొండ కల్చరల్: శ్రీసాయి మీరా కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో నెలనెలా నిర్వహించే సంగీత సాహిత్య కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. హనుమకొండ సర్క్యూట్ హౌస్‌లోని శ్రీసాయి మీరా సంగీత కళాక్షేత్రంలో సొసైటీ వ్యవస్థాపకుడు, చైర్మన్ పోతనాచారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కవి విప్పనపల్లి రవికుమార్ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉదయం 10గంటల నుంచి రాత్రి 9గంటల వరకు జరిగిన కార్యక్రమంలో కవులు పాల్గొని 'నీ దేశానికి నువ్వేమిచ్చావు' అనే అంశంపై కవితను వినిపించారు. అనంతరం కవి, కేర్ అండ్ క్యూర్ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ ఆచార్య వెలుదండి రవికుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కవి సిరాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వరంగల్ ఎల్బీ కళాశాల ఎదుట గుడ్ వైబ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేస్తున్న జెన్కో బయోసిటికల్స్ మేనేజింగ్ డైరెక్టర్ గంట రాజేశ్వర్ రెడ్డి

జర్నలిస్ట్‌కు 'మెపా' ఆర్థిక చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న మెపా నాయకులు

హన్మకొండ: అనారోగ్యంతో బాధపడుతున్న జర్నలిస్ట్ పల్లెబోయిన నాగరాజుకు ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆర్థిక చేయూతనందించింది. ఈ మేరకు హనుమకొండ స్నేహనగర్‌లోని నివాస గృహంలో నాగరాజును మెపా నాయకులు ఆదివారం పరామర్శించి, రూ.1,07,669ల ఆర్థిక సాయాన్ని అందించారు. పరామర్శించిన వారిలో మెపా రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్, ఉపాధ్యక్షుడు పొన్నం రాజు, నాయకులు పులి ప్రభాకర్, నీరటి రాజు, బోనాల రమేష్, గోనెల విజేందర్, సంకెళ్ల శ్రీధర్, పోలుదాసరి రాము, బైరి సోమయ్య, రంజిత్, ఒద్దుల హరీష్, కట్ల విజయ్, పిట్టల రాజు, మిట్టపల్లి సాంబయ్య, కాజీపేట బాబన్న, గోనెల సాగర్, గోనెల దేవేందర్, పిట్టల దినేష్, బాలబోయిన సంతోష్, సాయిరాం, నర్ర శివాజీ, సుధాకర్, విక్రమ్, సూరి ఉన్నారు.

13న జాతీయ గీతాల పోటీలు

విద్యారణ్యపురి: భారత్ వికాస్ పరిషత్ (బీవీపీ) ఓరుగల్లు శాఖ ఆధ్వర్యంలో ఈనెల 13న హనుమకొండలోని సామ జగన్మోహన్ స్మారక భవన్‌లో విద్యార్థులకు జాతీయ బృంద గీతాల పోటీలు నిర్వహించనున్నట్లు బీవీపీ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ సుధీర్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. హనుమకొండలోని డెఫడెల్ హైస్కూల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన బీవీపీ జిల్లాస్థాయి సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించేందుకు పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 94406 04347, 98666 60374 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో బాధ్యులు వెంకటరెడ్డి, చంచల్ అగర్వాల్, సంతోష్‌రెడ్డి, రామారావు, జయపాల్‌రెడ్డి, అజితారాణి, వివేకానంద ప్రసాద్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



వరంగల్ చౌరస్తా: రిటైర్డ్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వెలిశోజు రామమనోహర్ డిమాండ్ చేశారు. వరంగల్ గిర్మాజీపేటలోని సరస్వతి విద్యానికేతన్‌లో తుమ్మ వీరయ్య అధ్యక్షతన ఆదివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులుగా పనిచేసి, పదవీ విరమణ పొందిన వారికి నోషనల్ ఇంక్రిమెంట్లు, పెన్షనరీ బెనిఫిట్స్ చెల్లించాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గునిగంటి సాంబయ్య, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజయ్య, జిల్లా ఆర్థిక కార్యదర్శి సదానందం, జిల్లా మాజీ అధ్యక్షుడు సుధీర్ బాబు తదితరులు పాల్గొన్నారు.